క్లుప్తంగా

35 మందికి ఉద్యోగాలు



ఇంటర్వ్యూ చేస్తున్న సంస్థ ప్రతినిధులు

ఉరవకొండ: చిన్నముష్టూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఏపీఎస్ఎస్‌డీసీ, సీడాప ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాబ్‌మేళాలో 35 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. డాక్టర్ రెడ్డీస్, క్రెడిట్ ఆక్సిస్ గ్రామీణ్‌లతో పాటు ప్రధాన కంపెనీలు పాల్గొన్నాయి. జాబ్ మేళాలో 200 మంది పాల్గొనగా, 35 మంది ఉద్యోగాలు సాధించినట్లు కంపెనీ ప్రతినిధులు తెలిపారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ అశ్రాఫ్‌అలీ, జనరల్ హెచ్‌ఓడీ నరసింహారెడ్డి, ప్రాంగణ నియామక అధికారి అలియాఫ్ హుసేన్, మహేష్, కోఆర్డినేటర్ జయలక్ష్మి, నారాయణస్వామి, అనిల్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

కళ్యాణదుర్గం రూరల్: విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన డబ్బు విడుదల చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశాడు. శనివారం పట్టణంలోని ఆర్‌డీఓ కార్యాలయం ఎదుట విద్యార్థులతో కలిసి ఏఐఎస్ఎఫ్ నాయకులు ధర్నా చేశారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు హనుమంతురాయుడు మాట్లాడుతూ యువగళం పాదయాత్రలో నారాలోకేష్ ఇచ్చిన హామీ జీవో నంబర్ 77 రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు మంజునాథ్, నియోజకవర్గ కోశాధికారి పవన్, పట్టణ కార్యదర్శి హర్షవర్ధన్, నియోజవర్గ గర్ల్స్ కన్వీనర్ మౌలిక, కోకన్వీనర్ స్రవంతి, విద్యార్థులు పాల్గొన్నారు.

5న ప్రజ్ఞా వికాస పరీక్షలు

ఉరవకొండ: ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు జనవరి 5న ప్రజ్ఞా వికాస పరీక్షలు ఉంటాయని యూటీఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు. శనివారం స్థానిక ఎస్‌కే ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పరీక్షల కరపత్రాలను విడుదల చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు సిద్దు, యూటీఎఫ్ సహాయ కార్యదర్శి రామప్పచౌదరి మాట్లాడారు. పదో తరగతి పరీక్షలంటే విద్యార్థుల్లో భయాన్ని పోగొట్టేందుకు జనవరి 5న ప్రజ్ఞా వికాస (మోడల్) పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. రూ.30 చెల్లించి పేర్లు నమోదు చేసుకొని హాల్ టికెట్లు తీసుకోవాలన్నారు. సెల్: 8179641653, 6305200875లో సంప్రదించాలన్నారు.

వేరుకుళ్లు నివారించుకోవాలి

కణేకల్లు: పప్పుశనగలో వేరుకుళ్లు నివారించుకోవాలని డీఏఓ ఉమామహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండలంలోని మాల్యం, సొల్లాపురం గ్రామాల్లో సాగు చేసిన పప్పుశనగ పంటను డీఏఓ పరిశీలించారు. అక్కడక్కడ మొక్కలను తొలగించి, పరిశీలించారు. సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. వాతావరణంలో చోటు చేసుకున్న మార్పులతో మొక్కల ఆకులు పసుపు రంగుగా మారి, ఆ తర్వాత ఎండిపోతున్నాయని రైతులు డీఏఓ దృష్టికి తెచ్చారు. ప్రస్తుతం మొక్కలు పూత, కాయదశలో వేరుకుళ్లు తెగుళ్లతో ఎండుముఖం పడుతుండడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు.

2029లోపు కృష్ణాజలాలు తీసుకొస్తాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు

గుమ్మఘట్ట: కరువు నియోజకవర్గాలైన కళ్యాణదుర్గం,రాయదుర్గానికి నీరందించేందుకు 2029 లోపు కృష్ణ జలాలను తీసుకొస్తామని ఎమ్మెల్యేలు అమిలినేని, కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని బీటీపీ గ్రామంలో ఆయకట్టు రైతుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యేలు రాయదుర్గం కాలవ శ్రీనివాసులు, కళ్యాణదుర్గం అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ లక్ష్మీనారాయణ,ఆర్డీఓ వసంతబాబు హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ నేటి నుంచి సాగునీరు అందిస్తున్నట్లు తెలిపారు. ఎడమవైపు కాలువలో 2,806 ఎకరాలకు, కుడివైపున ఉన్న కాలువలో 1,725 ఎకరాలకు సాగునీరందిస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో జలవనరులశాఖ ఈఈ అబ్దుల్‌షమీ, కళ్యాణదుర్గం డీఈఈ దామోదర,ఏఈఈ హరీష్,సాయిరాం, అనిల్,సాగునీటి సంఘం అధ్యక్షుడు కాలవ నాగరాజు,ఉపాధ్యక్షులు సుబాన్, నాయకులు కాలవ సన్నన్న, గిరిమల్లప్ప, తదితరులు పాల్గొన్నారు.

మత్స్యరంగాన్ని ఆదుకుంటాం

మత్స్యరంగాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటామని రాయదుర్గం, కళ్యాణదుర్గం ఎమ్మెల్యేలు కాలవ శ్రీనివాసులు, అమిలినేని సురేంద్రబాబు, ఎంపీ అంబికాలక్ష్మీనారాయణ అన్నారు. బీటీపీ రిజర్వాయర్‌లోకి ప్రధానమంత్రి మత్స్యసంపద యోజన పథకంలో భాగంగా 6,48,000 కట్ల, రోహు చేపపిల్లలను వదిలారు.

సీపీఎం జిల్లా సభ్యుడిగా అచ్యుత్ ప్రసాద్

కళ్యాణదుర్గం: సీపీఎం జిల్లా సభ్యులుగా శెట్టూరు మండలం యాటకల్లుకు చెందిన బి.అచ్యుత్ ప్రసాద్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన శనివారం విలేకరులకు తెలియజేశారు. సీపీఎం 14వ మహాసభలలో నూతన జిల్లా కమిటీ నియామకాన్ని రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎంపిక చేశారు.

సగంలోనే సొంతింటి కల

- నియోజకవర్గంలో 5,688 ఇళ్ల మంజూరు
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 2,975 ఇళ్లు పూర్తి
- మిగిలిన వాటి కొనసాగింపుపై దృష్టి సారించని కూటమి ప్రభుత్వం
- ఆందోళన చెందుతున్న లబ్ధిదారులు

కళ్యాణదుర్గం: పేదలందరికీ సొంతింటి కల నెరవేర్చాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పించారు. అందుకనుగుణంగా ఇల్లు అవసరమైన వారందరికీ ఇంటి స్థలంతోపాటు, ఇల్లు మంజూరు చేశారు. పేదల ఇళ్ల నిర్మాణ పనులు శరవేగంగా జరిగాయి. అంతలోనే సార్వత్రిక ఎన్నికలు రావడంతో నిర్మాణాలు ఆగాయి. ఆతర్వాత ఏర్పాటైన కూటమి ప్రభుత్వం... ఇళ్ల నిర్మాణాలపై దృష్టి సారించలేదు. దీంతో ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. దీంతో పేదోడి సొంతింటి కల కలగానే మిగిలిపోయే పరిస్థితి వచ్చింది.

నియోజకవర్గ వ్యాప్తంగా నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో 5,688 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో 2,975 ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యాయి. 2,713 ఇళ్ల నిర్మాణాలు వివిధ దశలలో ఉన్నాయి. గత ప్రభుత్వంలోనే గృహ నిర్మాణాలు పూర్తి చేయాలన్న లక్ష్యంగా పనులను శరవేగంగా చేయించారు. ప్రతి 500 గృహాలకు ఒక ప్రత్యేక అధికారిని నియమించి, పనులు త్వరతగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం.. అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. గృహ నిర్మాణాలను పట్టించుకోలేదన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షలు..

పట్టణ ప్రాంతాల్లో ఒక సెంటు, గ్రామీణ ప్రాంతాల్లో ఒకటిన్నర సెంటులో నిర్మించే ఒక్కో ఇంటికి రూ.1.80 లక్షల చొప్పున అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఖర్చు చేసింది. గతంలో లబ్ధిదారులకు మూడు రకాల ఆప్షన్లు ఇచ్చి, లబ్ధిదారుల అభీష్టం మేరకు ఇంటిని నిర్మించుకునే వెసులుబాటు కల్పించింది. నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్‌ను అతి తక్కువ ధరకే గృహ నిర్మాణ శాఖ అధికారులు సరఫరా చేశారు. ఒక్కో ఇంటికి రూ.35 వేల చొప్పున బ్యాంకు రుణం ఇప్పించారు. ఇంటి స్థలం సేకరణకు రూ.కోట్లు వెచ్చించారు.



కూటమి ప్రభుత్వ నిర్లక్ష్యంతో మొండి గోడలకే పరిమితమైన కంబదూరు జగనన్న లే అవుట్



అంతా అయోమయ పరిస్థితి...

జగనన్న కాలనీల్లో గత ప్రభుత్వం మౌలిక సదుపాయాలకు పెద్దపీట వేసింది. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఈ తరహాలో పేదలకు ఇంటి నిర్మాణాలను చేపట్టలేదు. ప్రైవేట్ వెంచర్లను తలదన్నేలా కాలనీలకు ముందు ఆర్చ్‌లను సైతం నిర్మించారు. జగనన్న కాలనీల్లో ప్రభుత్వ పాఠశాలలతో పాటు అంగన్వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వం నిర్ణయించింది. అయితే ప్రస్తుత కూటమి ప్రభుత్వం నుంచి ఇసుక సరఫరా సక్రమంగా లేకపోవడం, లే అవుట్లలో ఏర్పాటు చేయాల్సిన రోడ్లు, వీధి లైట్లు, డ్రైనేజీ, విద్యుత్ సరఫరా, ఇతర మౌలిక వసతులు కల్పించలేదు. దీనికి తోడు జగనన్న ప్రభుత్వంలో వచ్చిన ఇళ్లకు బిల్లులు ఇస్తారో లేదో కూడా తెలియని అయోమయ పరిస్థితి. దీంతో ఆయా కాలనీల్లో నిర్మాణాలు అర్ధంతరంగా ఆగిపోయాయి. ప్రస్తుతం గ్రామాల్లో మొండి గోడలు దర్శనమిస్తున్నాయి.



బ్రహ్మసముద్రం మండలం గొంచిరెడ్డిపల్లిలో అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలు

అప్పు చేశాం..బిల్లు రాలేదు



“ నాకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న కాలనీలో ఇంటి స్థలంతో పాటు ఇల్లు మంజూరయ్యింది. అప్పుడు నాకు 60 బస్తాల సిమెంట్, రూ.98 వేలు మాత్రమే ఇచ్చారు. అప్పులు చేసి ఇళ్లు కట్టుకున్నాను. కూటమి ప్రభుత్వం వచ్చాక బిల్లులు రాలేదు.

– బోయ చిత్తక్క, లబ్ధిదారురాలు

ఇళ్ల నిర్మాణాల పూర్తికి చర్యలు

“ అర్ధంతరంగా ఆగిన ఇళ్ల నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి పెట్టాం. త్వరతగతిన పూర్తి చేసుకునేందుకు లబ్ధిదారులకు చైతన్యం కల్పిస్తున్నాం. ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తేనే మొత్తం బిల్లు వస్తుంది. ప్రత్యేక కార్యచరణతో లబ్ధిదారుల ఇళ్లను పూర్తి చేసేందుకు కసరత్తు చేస్తున్నాం. త్వరలోనే పెండింగ్ బిల్లులను క్లియర్ చేస్తాం. బిల్లులపై పూర్తి నివేదికలను జిల్లా స్థాయి అధికారులకు నివేదించాం.

– విజయభాస్కర్ రావు, డీఈ, కళ్యాణదుర్గం

ఇసుక దిబ్బలున్న ప్రాంతాల పరిశీలన

కణేకల్లు: ఇసుక దిబ్బలున్న ప్రాంతంలో ఎడారి నివారణ చర్యలు చేపట్టనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కణేకల్లు, బొమ్మనహాళ్ మండలాల్లో వేదవతి హగిరి ఒడ్డున విస్తరించిన ఇసుక దిబ్బలను జిల్లా అధికారులు పరిశీలించారు. శనివారం కణేకల్లు మండలంలోని తుంబిగనూరు, గరుడచేడు, మీన్లహళ్లి, బిదరకుంతం, బొమ్మనహాళ్ మండలంలోని దర్గా హొన్నూరులోని ఇసుక దిబ్బలను డీఏఓ ఉమామహేశ్వరమ్మ, డ్వామా పీడీ సలీంబాషా, జిల్లా హార్టికల్చర్ అధికారి నరసింహారావు, ఏపీఎంఐపీ పీడీ రఘునాథరెడ్డి పరిశీలించారు. పట్టా భూముల్లో ఇసుక దిబ్బలున్న రైతులతో అధికారులు అభిప్రాయాలు సేకరించారు. తమ భూముల్లో ఉన్న ఇసుకను నల్లరేగడి, చౌడు భూములకు తరలించాలని తుంబిగనూరు సర్పంచు ఫణీంద్ర, రైతులు వాలం వెంకటేశులు, వీరుపయ్య, రామదాసు, వన్నూరు స్వామి, ప్రభాకర్ అధికారుల దృష్టికి తెచ్చారు. ఏపీడీ అయిషా, ఏపీఓలు ప్రసాద్, భాగ్యలక్ష్మి, టెక్నికల్ అసిస్టెంట్లు సోమన్నగౌడ్, రమేష్, నాగరాజు, నాగేంద్ర, ఈసీ రమణ, రాజేష్ పాల్గొన్నారు.



దర్గా హొన్నూరు వద్ద ఇసుక దిబ్బలను పరిశీలిస్తున్న జిల్లా అధికారులు

ఇసుక దిబ్బల్లో ఉపాధి పనులు

బొమ్మనహాళ్: బొమ్మనహాళ్, కణేకల్లు మండలాల్లోని ఇసుక దిబ్బల్లో ఉపాధి హామీ పనులు చేపట్టేందుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నట్లు డ్వామా పీడీ సలీంబాషా, డీఏఓ ఉమామహేశ్వరమ్మ అన్నారు. శనివారం దర్గా హొన్నూరు, గరుడచేడు, మాల్యం, బిదురుకుంతం ల్లోని ఇసుక దిబ్బలను ఉపాధి హామీ సిబ్బందితో పరిశీలించారు. ఏపీఎం భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటాం

- సమన్వయకర్త తలారి రంగయ్య

కళ్యాణదుర్గం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని మాజీ ఎంపీ, సమన్వయకర్త తలారి రంగయ్య తెలిపారు. మున్సిపాలిటీలోని 23వ వార్డు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ అర్చన, హరి ప్రకాష్ దంపతులకు చెందిన స్కార్పియోకు ఇటీవల గుర్తు తెలియని దుండుగులు నిప్పు పెట్టారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త రంగయ్య, పార్టీ నేతలు ఉమా మహేశ్వర నాయుడు, తిప్పేస్వామి, రఘునాథ్‌రెడ్డి తదితరులు బాధితులను పరామర్శించారు. అనంతరం వారు మాట్లాడుతూ నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కళ్యాణదుర్గంలో ఎన్నడూ లేని విధంగా విష సంస్కృతికి కూటమి నేతలు తెర లేపారన్నారు. ప్రైవేట్ ఆస్తులు ధ్వంసం చేయడం సరికాదన్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుని చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో వైఎస్సార్‌సీపీ తరపున ఆందోళనలు చేస్తామన్నారు.



కాలిపోయిన స్కార్పియోను పరిశీలిస్తున్న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య, పార్టీ నేతలు ఉమా, తిప్పేస్వామి

డిపోలో వసతుల కల్పనకు చర్యలు

- ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని

ఉరవకొండ: ఉరవకొండ ఆర్టీసీ డిపోలో ప్రయాణికులకు అవసరమైన సౌకర్యాలు కల్పనకు చర్యలు తీసుకుంటున్నట్లు ఆర్టీసీ ఆర్ఎం సుమంత్ ఆర్ ఆదోని తెలిపారు. శనివారం ఉరవకొండ ఆర్టీసీ డిపోను ఆర్ఎం తనిఖీ చేశారు. ఆర్టీసీ డిపోలో ఉన్న ప్రయాణికులతో మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డ్రైవర్లు, కండక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఆర్ఎం మాట్లాడుతూ డిపోలో ప్రయాణికులకు తాగునీరు,పాటు మరుగుదొడ్ల ఏర్పాటు చేయిస్తామన్నారు. జిల్లాలో 8 డిపోలకు 80 కొత్త బస్సులు మంజూరయ్యాయన్నారు. ఇందులో ఆర్టీసీ 46, హయ్యార్–34 బస్సులు ఉన్నాయన్నారు. ఉరవకొండ డిపోకు సూపర్ లగ్జరీ-2, అల్ట్రా డీలక్స్-2, పల్లె వెలుగు-1 ఉన్నాయన్నారు. జిల్లాలో జనవరి 1-2020 తరువాత చనిపోయిన ఆర్టీసీ ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు కారుణ్య నియామకాలు చేపట్టడానికి చర్యలు తీసుకున్నామన్నారు. మొత్తం 70 ఖాళీలు ఉండగా, ఇప్పటి వరకు 81 దరఖాస్తులు స్వీకరించి, వాటిని పరిశీలిస్తున్నామన్నారు. ఇప్పటికే జిల్లాలలోని 8 డిపోల్లో 516 సర్వీసులు ఉన్నాయని, వీటి ద్వారా రోజు 1.56 లక్షల మంది ప్రయాణికులకు వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఉరవకొండ డిపో మేనేజర్ బాలాజీ దయాళ్, సిబ్బంది పాల్గొన్నారు.



ఉరవకొండ డిపోలో డ్రైవర్లు, కండక్టర్లకు సూచనలు చేస్తున్న ఆర్ఎం సుమంత్ ఆదోని

ప్రతి రైతు నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలి



వినతి పత్రం అందిస్తున్న మండల కన్వీనర్ రామాంజనేయులు

బొమ్మనహాళ్: మండలంలోని ఉద్దేహాళ్, శ్రీధరఘట్ట గ్రామాల్లోని సొసైటీల్లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాల్లో ప్రతి రైతు నుంచి వరి కొనుగోలు చేయాలని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రామాంజనేయులు తెలిపారు. శనివారం మండలంలోని ఉద్దేహాళ్ సొసైటీ సీఈఓ హనుమంతుకు వినతి పత్రం అందించారు. కన్వీనర్ మాట్లాడుతూ వరి రైతులను వెంటనే ఖాళీ గోనె సంచులను పంపిణీ చేయాలన్నారు. అరకొరగా గోనె సంచులు ఇస్తుండడంతో రైతులు కొనుగోలు కేంద్రాల చుట్టూ పడిగాపులు కాస్తున్నారన్నారు. ఈ-క్రాప్ బుకింగ్ చేసుకున్న ప్రతి రైతుకూ ఖాళీ గోనె సంచులను ఇచ్చి, వారి నుంచి వరి ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీకి చెందిన రైతుల నుంచే ధాన్యం కొనుగోలు చేస్తున్నట్లు విమర్శలు ఉన్నాయన్నారు. వైస్ ఎంపీపీ కందేపల్లి రమేష్, నాయకులు వన్నూరుస్వామి, చిందానంద పాల్గొన్నారు.

దాడిచేసిన వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలి

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు మండలానికి చెందిన బీజేపీ నాయకుడు చక్రవర్తిపై దాడిచేసిన టీడీపీ నాయకులపై చర్యలు తీసుకోవాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, పార్లమెంట్ కన్వీనర్ లలిత్‌కుమార్ డిమాండ్ చేశారు. శనివారం పట్టణంలోని ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో వారు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ నాయకులు చేసిన అవినీతిని ప్రశ్నించినందుకు బీజేపీ నాయకుడు చక్రవర్తిపై దాడి చేయడం సరికాదన్నారు. కంబదూరు మండలంలో సీసీరోడ్లు నిర్మించకుండా అధికారులు, టీడీపీ నాయకులు కలిసి అవినీతికి పాల్పడ్డారన్నారు. దాడిలో గాయపడిన చక్రవర్తి కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. దాడిచేసిన టీడీపీ నాయకులపై పోలీసులు వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాడు. కార్యక్రమంలో బీజేపీ కన్వీనర్ పుష్పరాజ్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

ఎక్స్‌ప్రెస్ రైళ్లు నిలపాలి

రాయదుర్గంటౌన్: రాయదుర్గం రైల్వేస్టేషన్ మీదుగా నడిచే ఎక్స్‌ప్రెస్ రైళ్లకు నిలపాలని ఎంపీ అంబికా లక్ష్మీనారాయణకు పట్టణ ప్రముఖులు, ప్రయాణికులు వినతిపత్రం అందజేశారు. శనివారం రాయదుర్గం పర్యటనకు వచ్చిన ఎంపీని స్థానిక ఆర్అండ్‌బీ అతిథి గృహంలో జయంతి సురేష్‌కుమార్, ఉమామేశ్వరయ్య, లక్ష్మణమూర్తి, నాగరాజు తదితరులు కలిశారు. అనంతరం ఎంపీ, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులకు వినతిపత్రం అందజేశారు. మైసూరు-వారణాసి, యశ్వంత్‌పూర్-టాటా నగర్, జైపూర్-యశ్వంత్‌పూర్ రైళ్లకు రాయదుర్గంలో స్టాపింగ్ కల్పించాలని, అలాగే ఏడాది నుంచి రద్దు చేస్తూ వస్తున్న కదిరిదేవరపల్లి-తిరుపతి రైలును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

ఈ-కేవైసీ చేయించుకోండి

కూడేరు: మండలంలోని ప్రాథమిక వ్యవసాయ పరస్పర సహకార సంఘ సభ్యులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని సంఘం ఇన్‌చార్జ్ బాలాజీ, ఎంపీడీఓ కుళ్లాయిస్వామి శనివారం తెలిపారు. ఇప్పటికి 410 మందే చేయించుకున్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

కుందుర్పి: మండలంలోని వడ్డేపాళ్యం గ్రామంలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని శనివారం జరుపుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ సంజీవయ్య మాట్లాడారు. నాయకులు నరసింహప్ప పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాయకులు మంజునాథ్, విరూపాక్షి, నాగభూషణ, గోవిందు పాల్గొన్నారు.

నూతన కమిటీ ఏర్పాటు

కంబదూరు: మండలంలోని తిమ్మాపురం గ్రామంలో ఎస్సీ,ఎస్టీ జేఏసీ సంఘాల రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి ఆదేశాల మేరకు గ్రామ కమిటీని శనివారం ఏర్పాటు చేశారు. అధ్యక్షుడిగా మారుతి, ఉపాధ్యక్షుడిగా వెంకటేష్, గౌరవ అధ్యక్షుడిగా మధు, ప్రధాన కార్యదర్శిగా రామదాసు, కార్యదర్శిగా దినాకర్, ప్రధాన సలహాదారుడిగా నోవా, అధికారి ప్రతినిధిగా తిమ్మయ్యను ఏకగ్రీవంగా ఎన్నిక చేసినట్లు సంఘం మండల అధ్యక్షుడు డాబా రమేష్, ఉపాధ్యక్షుడు కురాకులపల్లి గోపాల్ తెలిపారు.

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి

బొమ్మనహాళ్: రైతులు, ప్రజలు రెవెన్యూ సదస్సులను ద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండలంలోని గోనేహాళ్ గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సు కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ పాల్గొన్నారు. అనంతరం గ్రామంలో 74 ఇంటి పట్టాలను ఎమ్మెల్యే కాలవ చేతుల మీదుగా అందించారు. గోనేహాళ్‌ను అన్నివిధాలుగా అభివృద్ధి చేస్తామన్నారు. ఆర్డీవో వసంతబాబు, తహసీల్దార్ మునివేలు, తుంగభద్ర ప్రాజెక్టు వైస్ చైర్మన్ కేశవ్‌రెడ్డి, ఈఓపీఆర్‌డీ దాస్, ఏఓ సాయికుమార్, ఎంఈఓ మల్లికార్జున పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం

వజ్రకరూరు: భూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు రెవెన్యూ సదస్సులు చక్కటి వేదికలు అని గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. శనివారం మండల పరిధిలోని గూళ్యపాళ్యం గ్రామసచివాలయం వద్ద రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి అర్జీని సత్వరమే పరిష్కరించనున్నట్లు తెలిపారు. రైతులు కూడా సహకరిస్తే సమస్యలను గడువులోపు పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. మొత్తం 25 వినతులు అందినట్లు తెలిపారు. తహసీల్దార్ నయాజ్‌అహమ్మద్, సర్పంచు కురుబలక్ష్మయ్య, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, మండల సర్వేయర్ మంజుల, ఆర్ఐ అశ్వర్థనారాయణ, వీఆర్ఓ సుధాకర్, సచివాలయ ఉద్యోగులు,గ్రామస్తులు పాల్గొన్నారు.



గూళ్యపాళ్యం రెవెన్యూ సదస్సులో మాట్లాడుతున్న గుంతకల్లు ఆర్డీఓ శ్రీనివాసులు

బొమ్మనహాళ్... ఔతుగుప్ప: గ్రామాల్లో కొనసాగుతున్న రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ షర్మిళ పేర్కొన్నారు. శనివారం కోనాపురంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆర్ఐ రమాదేవి, సర్వేయర్లు, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు. మొత్తం 8 వినతులు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు.వీఆర్ఓ చంద్రశేఖర్, సర్వేయర్ సందీప్, వివిధ గ్రామాల సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

కూడేరు: కూడేరులోని సచివాలయం-1లో అధికారులు రెవెన్యూ సదస్సు శనివారం నిర్వహించారు. భూ, ఇతర సమస్యల పరిష్కారానికి ప్రజల నుంచి 65 వినతులు వచ్చాయి. తహసీల్దార్ మహబూబ్ బాషా స్వీకరించారు. తహసీల్దార్ మహబూబ్ బాషా, సర్పంచ్ లలితమ్మ, ఎంపీడీఓ కార్యాలయ సూపరింటెండెంట్ కేశవ, రీసర్వే తహసీల్దార్ ప్రసాద్, సర్వేయర్ అయేషా సిద్ధిక్, వీఆర్వో రమేష్ పాల్గొన్నారు.

గుప్త నిధుల కోసం శివలింగం తొలగింపు

కుందుర్పి: నరసంపల్లి సమీపంలోని పురాతన శివాలయంలో గుప్త నిధుల కోసం శివలింగం, నంది విగ్రహాన్ని తొలగించారు. వివరాలు.. కుందుర్పి-అల్లాపురం మార్గంలో పురాతన శివాలయం ఉంది. ఏడాది క్రితం వరకూ అర్చకుడు చంద్రప్ప అక్కడే నివాసముండేవారు. అక్కడ సౌకర్యాల లేమితో కుందుర్పికి మకాం మార్చాడు. దీంతో ఆలయం వద్ద జనసంచారం లేకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తులు శనివా రం రాత్రి గుప్తనిధుల కోసం శివలింగం, నంది విగ్రహాలను పక్కకు తోసేసి 4 మీటర్లు లోతు వరకు తవ్వకాలు జరిపారు. ఇదిలా ఉండగా 2 నెలల క్రితం మలయనూరు పంచలింగాల ఆలయం, ఇటీవల ఎనుములదొడ్డి శివాలయాల్లోనూ ఇలాగే తవ్వకాలు జరిపారు. ఇప్పటికైనా పోలీసులు గుప్తనిధుల తవ్వకాలపై నిఘా పెట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ముమ్మరంగా ఎస్‌హెచ్‌జీ ప్రొఫైల్ సర్వే ఆన్‌లైన్ నమోదు



సర్వే వివరాలను ఆన్‌లైన్ చేస్తున్న అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలు

రాయదుర్గంటౌన్: స్వయం సహాయక సంఘాల (ఎస్‌హెచ్‌జీ) ప్రొఫైల్ సర్వే క్షేత్రస్థాయిలో ఇటీవల ముగిసింది. నాటి నుంచి మెప్మా విభాగంలో అధికారులు, సిబ్బంది, ఆర్‌పీలు సర్వే ప్రక్రియను ఆన్‌లైన్ చేయడంలో తలమునలవుతున్నారు. పట్టణంలోని 18 సచివాలయాల పరిధిలో 1,388 పొదుపు సంఘాలు ఉండగా 13,568 మంది సభ్యులు ఉన్నారు. రాష్ట్ర స్థానికంగా 98.78 శాతం సర్వే పూర్తి చేసినట్లు మెప్మా టీపీవో సుబ్బరాయుడు, టీఎంసీ నారాయణరెడ్డి తెలిపారు.

బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేద్దాం



ప్రతిజ్ఞ చేయిస్తున్న సీడీపీఓ శ్రీదేవి, అధికారులు

వజ్రకరూరు: బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని ఉరవకొండ ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. శనివారం స్థానిక మినీ కళ్యాణ మంటపంలో కిశోర వికాసంపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా బాల్య వివాహాలు లేని సమాజంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం బాల్య వివాహాలు జరగడం వల్ల ఎదురయ్యే సమస్యలు, అనర్థాలను స్క్రీన్ ద్వారా వివరించారు. సీడీపీఓ శ్రీదేవి, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ టెన్త్, ఇంటర్ వరకు చదివి ఉన్నత చదువులకు వెళ్లని బాలికలకు వృత్తి శిక్షణలో శిక్షణ ఇప్పిస్తామన్నారు. అనంతరం పోస్టర్లు విడుదల చేశారు. కార్యక్రమంలో సర్పంచు మోనాలిసా, ఎంపీడీఓ రవిప్రసాద్, వైద్యాధికారి తేజశ్వి, ఎస్ఐ నాగస్వామి, ఈఓఆర్డీ దామోదర్‌రెడ్డి, జిల్లా బాలల పరిరక్షణ సమితి ప్రతినిధి రమాదేవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు పద్మావతి, హెచ్.పద్మా, హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో మండల పూజ



శెట్టూరులో పూజ చేస్తున్న అయ్యప్పస్వామి భక్తులు

శెట్టూరు: మండల కేంద్రంలో అయ్యప్పస్వామి మండల పూజ శనివారం ఘనంగా నిర్వహించారు. ఆంజనేయస్వామి ఆలయంలో అయ్యప్పస్వామి పడిపూజ చేశారు. నవగ్రహ ఆరాధన, పంచామృతం, సహిత, రుద్రాభిషేకం, గణపతి నవగ్రహాల హోమం నిర్వహించారు. అయ్యప్పస్వామి ఉత్సవ మూర్తిని ప్రధాన వీధుల్లో గ్రామోత్సవం చేశారు. అనంతరం అన్నదానం చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు ప్రసాద్, వెంకటేశులు, శ్రీధర్, రామ్మోహన్‌రెడ్డి, ఈరన్న, మహేష్, చిన్నబాబు, రమేష్, మధు, వినయ్, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

గుడిసె దగ్ధం

బొమ్మనహాళ్: మండలంలోని కల్లుదేవనహళ్లిలో శనివారం తెల్లవారుజామున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసె దగ్ధమైంది. దీంతో ఇంట్లో ఉన్న టీవీ, బియ్యం , బీరువా, బట్టలు, ఇతర సామగ్రి కాలిపోయింది. దాదాపు రూ. 5 లక్షల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు తెలిపారు. బాధితుడు కృష్ణ మాట్లాడుతూ భార్య గంగమ్మ, కుమారుడు వెంకటేష్‌తో కలిసి మొక్కజొన్న కోత పనులకు వెళ్లారు. ఆసమయంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో గుడిసెకు నిప్పంటుకుంది. ఎవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. కాలిపోయిన గుడిసెను పరిశీలిస్తామని తహసీల్దార్ మునివేలు తెలిపారు.

నైపుణ్య శిక్షణ

రాయదుర్గంటౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వివిధ రకాల సేవలందించే వారు (సర్వీస్ ప్రొవైడర్స్) నైపుణ్య శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ దివాకర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శనివారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. ప్లంబర్, తాపీ మేస్త్రీలు, కార్పెంటర్లు, పెయింటర్లు, ఎలక్ట్రీషియన్లు, టీవీ, ఏసీ, రెఫ్రిజిరేటర్స్, గీజర్, వాషింగ్ మిషన్, హెయిర్ కటింగ్, బ్యూటీషియన్లు, గ్యాస్ స్టవ్, ఈవెంట్ మేనేజ్‌మెంట్, పాకర్స్ మూవర్లకు నైపుణ్య శిక్షణ ఇచ్చి సర్టిఫికెట్లు ఇవ్వనున్నట్లు చెప్పారు.

వేంకటరమణుడికి ధనుర్మాస పూజలు



సతీసమేత వేంకటరమణస్వామి

రాయదుర్గంటౌన్: పట్టణంలోని కోటలో వెలసిన ప్రసిద్ధిగాంచిన ప్రసన్న వేంకటరమణస్వామి ఆలయంలో ధనుర్మాస పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. శనివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ధనుర్మాస పూజలు, తిరుప్పావై సేవకు భక్తులు భారీ సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకున్నారు.